
# నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, సోమవారం 16 సెప్టెంబర్ 2024 | HYDERABAD


సిటీబ్యూరో, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): రుతుపవనాల ప్రభావంతో ఆదివారం గ్రేటర్‌లోని కొన్ని చోట్ల తేలికపాటి జల్లులు పడ్డాయి. నగరంలోని కుషాయిగూడ, ఏఎస్‌రావు నగర్, కాప్రా, బంజారాహిల్స్ తదితర ప్రాంతాల్లో జల్లులు కురిశాయి. కాగా, కిందిస్థాయి గాలుల ప్రభావంతో నగరంలో ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 31.2, కనిష్ఠం 23.2 డిగ్రీలు, గాలిలో తేమ 56 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

## కొత్త రేషన్‌కార్డుల మంజూరెప్పుడో..?



మేడ్చల్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తుదారులకు ఎదురు చూపులు తప్పడం లేదు. సర్కారు నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల కోసం 3.98 లక్షల దరఖాస్తులు వచ్చాయి. అయితే అర్జీలు స్వీకరించి.. నెలలు గడుస్తున్నా..ఇప్పటి వరకు రేషన్‌కార్డులు మంజూరు కాకపోవడంపై దరఖాస్తుదారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అసలు కొత్త రేషన్ కార్డులు ఇస్తారా లేదా దరఖాస్తులకే పరిమితం చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా, జిల్లావ్యాప్తంగా మొత్తం 5,23,899 రేషన్ కార్డులు ఉండగా, ప్రతి నెలా 10,636,765 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు.



**భక్తజన సంద్రం**
ఆదివారం ఖైరతాబాద్ మహాగణపతి దర్శనానికి పోటెత్తిన భక్తులు



## మెట్రో గ్రాఫ్ డౌన్..

**2 నుంచి 5కు పడిపోయిన హైదరాబాద్ మెట్రో స్థానం**

**9 నెలలుగా ప్రతిపాదనలతోనే**

**కాంగ్రెస్ సర్కారు కాలయాపన**

సిటీబ్యూరో, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): సుస్థిర ప్రభుత్వం... సమర్థ నాయకత్వంతో పదేండ్లలో తెలంగాణ అన్ని రంగాల్లో అత్యుత్తమంగా ఎదుగుతూ వచ్చింది. హైదరాబాద్ మహానగరం అన్ని రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి ర్యాంకులు, అత్యుత్తమ స్థానాలను సొంతం చేసుకుంది. అలాంటి మహానగరాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అట్టడుగు స్థాయికి తీసుకువెళ్తున్నది. ఒకప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద పబ్లిక్ ప్రైవేటు పార్టనర్ ప్రాజెక్టుగా హైదరాబాద్ మెట్రో రైలు రికార్డుల కెక్కింది. మహానగరంలో అత్యాధునిక ప్రజా రవాణా వ్యవస్థలో అత్యంత కీలకమైన మెట్రో రైలు ప్రాజెక్టులను కాంగ్రెస్ ఇష్టారాజ్యంగా మార్చివేసింది. గత కేసీఆర్ ప్రభుత్వం మొత్తం 415 కి.మీ మేర నగరం నలుమూలలా మెట్రో మార్గాలను దశల వారీగా నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేయడంతో పాటు క్షేత్ర స్థాయిలో పనులు చేపడితే వాటిని పూర్తిగా రద్దు చేసి.. కొత్త మార్గాలను 70 కి.మీ పరిమితం చేసి.. రేవంత్ సర్కారు ప్రతిపాదించింది. దీంతో 9 నెలలుగా కొత్తగా ఒక్క మెట్రో ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అనుమతులు రాకపోవడమే కాకుండా నిర్మాణంలో ఒక్క కి.మీ మెట్రో మార్గం కూడా లేదు. దీంతో దేశంలో హైదరాబాద్ మెట్రో రైలు స్థానం 5వ స్థానానికి పడిపోయింది. ఇప్పటి వరకు 70 కి.మీ మేర ప్రతిపాదించిన 7 మార్గాలకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలు(డీపీఆర్) సిద్ధం చేయలేని దుస్థితి కాంగ్రెస్ ప్రభుత్వానిది. ఒకవైపు హైదరాబాద్ కంటే వెనకబడి ఉన్న చెన్నై, బెంగళూరు, పుణె వంటి నగరాల్లో 100కు పైగా కి.మీ మేర మెట్రో మార్గాలు నిర్మాణంలో ఉంటే, హైదరాబాద్‌లో మాత్రం నిర్వహణలో ఉన్నది కేవలం 69 కి.మీలు ఉండగా, నిర్మాణంలో ఒక్క కి.మీ మెట్రో మార్గం లేదు. ఇక ప్రతిపాదన దశలో ఉన్న 70 కి.మీ మార్గానికి ఎప్పుడు డీపీఆర్ వస్తుంది? దానికి కేంద్రం నుంచి అనుమతులు, నిధుల కేటాయింపు అన్నది పెద్ద ప్రశ్నగా మారింది.

### దేశంలో 902 కి.మీ మెట్రో మార్గం...

దేశ వ్యాప్తంగా అన్ని నగరాల్లో కలిపి మెట్రో మార్గం సుమారు 902.39 కి.మీ మేర ఉన్నాయి. మెట్రో రైళ్లకు దేశ వ్యాప్తంగా ఆదరణ ఉండటంతో కొత్త మార్గాలను ప్రతిపాదిస్తూ , దశల వారీగా నిర్మాణం చేపడుతున్నారు. ప్రస్తుతం నిర్మాణ దశలోనే 649.56 కి.మీ ఉండగా, కొత్తగా ఆమోదం పొందిన మార్గాలు 261.03 కి.మీ, ప్రతిపాదనల దశలో మరో 1065 .83 కి.మీ మేర మార్గాలు ఉన్నాయి. అయితే హైదరాబాద్ మెట్రో రైలు మార్గం మాత్రం 69 కి.మీకే పరిమితమవ్వడంపై నగర వాసులు నిరుత్సాహంతో ఉన్నారు. మెట్రో మార్గాల నిర్మాణంలో ఢిల్లీ మెట్రోతో పోటీపడాల్సిన హైదరాబాద్ 5వ స్థానం నుంచి అంతకంతకు దిగజారిపోతున్న పరిస్థితి కనిపిస్తున్నది.

## భాగ్యనగర్ ఉత్సవ సమితి ఆందోళన

# దిగొచ్చిన సర్కారు

**ట్యాంక్‌బండ్‌పై నిమజ్జన ఏర్పాట్లు**

సిటీబ్యూరో: ట్యాంక్‌బండ్‌పై వినాయక నిమజ్జనం అనేక ఏండ్లుగా కొనసాగుతున్నదని, కొత్త రూల్స్ తీసుకొచ్చి.. భక్తుల మనోభావాలు దెబ్బతీస్తున్నారంటూ భాగ్యనగర్ ఉత్సవ సమితి సభ్యులు మండిపడ్డారు. ఆదివారం హుస్సేన్ సాగర్ వద్ద ఆందోళన చేపట్టిన ఉత్సవ సమితి సభ్యులు.. ట్యాంక్‌బండ్‌పై వినాయక నిమజ్జనం లేదంటూ పోలీసులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బారికేడ్లను తొలగించారు. వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. ట్యాంక్‌బండ్‌పై నిమజ్జన ఏర్పాట్లు చేయాలని, లేదంటే సోమవారం అన్ని మండపాల నిర్వాహకులకు సమాచారమిచ్చి.. నగరవ్యాప్తంగా ఆందోళన చేసి.. ఎక్కడికక్కడ మండపాల్లో వినాయకులను అలాగే ఉంచుతామని హెచ్చరించారు. ఉత్సవ సమితి సభ్యుల ఆందోళనకు దిగొచ్చిన ప్రభుత్వం హడావిడిగా ట్యాంక్‌బండ్‌పై ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

**ఏర్పాట్లు చేయకుంటే.. మండపాల్లోనే గణనాథులను ఉంచుతామని ఉత్సవ సమితి హెచ్చరిక**

**భక్తుల మనోభావాలు దెబ్బ తీస్తారా అంటూ ఆగ్రహం**

**ఆందోళనతో ట్యాంక్‌బండ్‌పై ప్రత్యేక ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం**

### విద్యుత్ అంతరాయం తలెత్తకుండా..

గణేశ్ విగ్రహాల శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ అన్ని ఏర్పాట్లు చేసింది. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ఉండేందుకు 10 సర్కిళ్ల పరిధిలోని ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి, క్షేత్ర స్థాయిలో ఉండి పర్యవేక్షణ చేయాలని సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఇప్పటికే ఆదేశించారు. ఇందులోభాగంగానే ఎన్టీఆర్ మార్గ్‌లో విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను ఇటీవలే సీఎండీ ప్రారంభించారు. నిమజ్జనం సందర్భంగా ప్రత్యేకంగా నిర్ణయించిన మార్గాల్లో శోభాయాత్రను నిర్వహిస్తున్న నేపథ్యంలో సరఫరా నిరంతరం ఉండేందుకు, విద్యుత్ అదనపు లోడ్‌కు సరిపోయేలా 500 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు , 315 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు 31, 160 కేవీఏ సామర్థ్యంతో కూడిన 37 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. బాలాపూర్ నుంచి హుస్సేన్‌సాగర్ వరకు సాగే గణేశ్ విగ్రహాల శోభాయాత్ర కోసం సుమారు 55 కి.మీ మేర 11 కేవీ ఎల్‌టీ కేబుళ్లు, పోల్స్, కండక్టర్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. కాగా, శోభాయాత్ర మొదలై నిమజ్జనం పూర్తయ్యే వరకు సూపరింటెండెంట్ ఇంజినీర్లు, డివిజినల్ ఇంజినీర్లు క్షేత్ర స్థాయిలో ఉండి పర్యవేక్షణ చేయనున్నారు. హుస్సేన్‌సాగర్ తీరంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని, మండప నిర్వాహకులు, ప్రజలు విద్యుత్ భద్రత సూచనలు పాటిస్తూ ఎక్కడైనా అవాంఛనీయ పరిస్థితులు ఏర్పడితే కంట్రోల్ రూమ్ లేదా 100, 1912 నంబర్లకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు.

## కీలక ఘట్టానికి సర్వం సిద్ధం..

గణపతి నవరాత్రోత్సవాల్లో కీలక ఘట్టమైన నిమజ్జనానికి అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది.హెచ్ఎండీఏ, ఆర్ అండ్ బీ, జలమండలి, గ్రేటర్ డిస్కం, పర్యాటక, పోలీస్ శాఖలు సమన్వయం చేసుకుంటూ.. ప్రశాంత వాతావరణంలో నిమజ్జన ప్రక్రియను పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాయి. హుస్సేన్‌సాగర్, జీడిమెట్ల ఫాక్స్ సాగర్, బహదూర్‌పుర, మిరాలం చెరువు, కాప్రా ఊర చెరువు, సరూర్‌నగర్ ట్యాంక్‌బండ్‌తో సహా పీవోపీ విగ్రహాల కోసం ప్రత్యేకంగా 73 కొలనులను ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో క్రేన్లను అందుబాటులో ఉంచారు. ఆరు జోన్ల పరిధిలో స్టాటిక్ క్రేన్స్ 21, మొబైల్ క్రేన్స్ 295, 213 గణేశ్ యాక్షన్ బృందాలను నియమించారు. వ్యర్థాలను తరలించేందుకు మినీ టిప్పర్లు 102, 125 జేసీబీలను సిద్ధం చేశారు. శోభాయాత్రకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వహణ పనులతో పాటు తాత్కాలిక పనులు చేపట్టారు. నిర్వహణ పనులు 172లకు గానూ రూ.12 కోట్లు, తాత్కాలిక పనులు 36కి గానూ రూ.16కోట్లు ఖర్చు చేస్తున్నారు. 52వేల లైట్లను బిగించారు. భక్తుల సౌకర్యార్థం 309 మొబైల్ టాయిలెట్లను అందుబాటులో ఉంచారు.

## మధ్యాహ్నం 1.30కల్లా మహాగణపతి నిమజ్జనం

అబిడ్స్: నిమజ్జనోత్సవం ప్రశాంతంగా జరిగేందుకు పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లను పూర్తి చేసిందని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. నాంపల్లి భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ మైదానంలో ఆదివారం రాత్రి ప్రభుత్వ శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో సీపీ మాట్లాడుతూ ఖైరతాబాద్ మహా గణపతి నిమజ్జనం మధ్యాహ్నం 1.30 కల్లా పూర్తవుతుందన్నారు. భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు రాఘవరెడ్డి, సమితి కార్యదర్శి డాక్టర్ రావినూతల శశిధర్, సైబరాబాద్ పోలీస్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నగర సీపీ సీవీ ఆనంద్

## లక్షల్లో జనం.. ఏర్పాట్లలో విఫలం..

**మహాగణపతి దర్శనానికి పోటెత్తిన భక్తులు**

**అదుపు చేయలేకపోయిన పోలీసులు**

**తొక్కిసలాట ..తోపులాటలతో వృద్ధులు, పిల్లలకు ఇబ్బందులు**

**3 కి.మీ పరిధిలో స్తంభించిన ట్రాఫిక్**

సిటీబ్యూరో, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ)/ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లో కొలువుదీరిన శ్రీ సప్తముఖ మహాశక్తి గణపతి దర్శనానికి ఆదివారం లక్షల్లో భక్తులు తరలివచ్చారు. అయితే జనం పోటెత్తడంతో పోలీసులు వారిని అదుపు చేయడంలో విఫలమయ్యారు. మహాగణపతిని దర్శించుకొని ఐమాక్స్, మింట్ కాంపౌండ్‌లకు వెళ్లే దారుల్లో భక్తుల మధ్య తోపులాటలు, స్వల్పంగా తొక్కిసలాటలు జరిగాయి. పలువురు వృద్ధులు, మహిళలు సొమ్మసిల్లిపడిపోయారు. వారిని బయటకు తీసుకువచ్చేందుకు పోలీసుల తరం కాలేదు. భక్తుల సాయంతో వారికి సపరియాలు చేశారు. ఇక అధిక సంఖ్యలో భక్తులు రావడంతో పరిసర ప్రాంతాల్లోని కూడళ్లన్నీ ట్రాఫిక్‌తో నిండిపోయాయి. ఖైరతాబాద్‌కు సుమారు 3 మూడు కిలోమీటర్ల పరిధిలో భక్తులు, వారు వచ్చిన వాహనాలతో రహదారులన్నీ నిండిపోయాయి. అయితే ఆదివారం రాత్రి వరకే దర్శనానికి అనుమతి ఉండటంతో పాటు సెలవు దినం కావడంతో భారీ సంఖ్యలో భక్తులు దర్శనానికి వచ్చారు. అయితే ఇంత పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని నిర్వాహకులు, పోలీసులు అంచనా వేయలేకపోయారనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలోనే వృద్ధులు, పిల్లలు రద్దీలో చిక్కుకొని విలవిలాడారు. తెల్లవారుజాము నుంచి భక్తుల రద్దీకి తోడు వీఐపీల దర్శనం కూడా ఉండటంతో పరిస్థితి చేయి దాటింది. సాయంత్రానికి భక్తుల రద్దీ విపరీతంగా పెరగడంతో తొక్కిసలాట చోటు చేసుకున్నది. చాలా మంది వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

## 75 అడుగుల పొడవు... 26 టైర్లు

**సప్తముఖుడి శోభాయాత్రకు భారీ వాహనం**

ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన శోభాయాత్రకు అధునాతన ట్రయిలర్‌ను వినియోగిస్తున్నారు. వోల్వో ఇంజన్ కలిగిన బీఎస్ 6 వాహనంలో అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. 75 అడుగుల పొడవు, 11అడుగుల వెడల్పు కలిగిన ఈ వాహనాన్ని 26 టైర్లు ఉంటాయి. వంద టన్నుల బరువును మోసే సామర్థ్యం కలిగి ఉంటుంది. మహాగణపతి విగ్రహం సుమారు 70 టన్నుల బరువు ఉంటుందని శిల్పి రాజేంద్రన్ చెబుతున్నారు. పదకొండు సంవత్సరాలుగా స్వామి వారికి రథసారథిగా వ్యవహరిస్తున్న భాస్కర్‌రెడ్డి ఈ ఏడాది కూడా వాహనాన్ని నడుపుతారు. ఈ ట్రాయిలర్‌తో రోడ్డు ఎలా ఉన్నా ఎలాంటి ఆటంకాలు లేకుండా గణపతి విగ్రహాన్ని తరలించవచ్చని చెబుతున్నారు. సోమవారం సాయంత్రం నుంచే గణపతి మండపం చుట్టూ ఉన్న షెడ్డు తొలగిస్తారు. రాత్రి 12గంటలకు కలశ పూజ నిర్వహించి విగ్రహానికి ఉద్వాసన పలికి శోభాయాత్రకు సిద్ధం చేస్తారు.